క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కు చెల్లింపులో భాగంగా పలువురు గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భారత రాజ్యాంగం గొప్పది

దొర్నిపాడు: భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



పెద్దమ్మకు జలాభిషేకం చేస్తున్న మహిళలు, అర్చకులు

ఉయ్యాలవాడ : రబీ సీజన్ ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించకపోవడంతో సాగు చేసిన పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని, మరి కొందరు రైతులు ఇప్పటి వరకు విత్తనం వేయలేదు. దీంతో వర్షం కురవాలని ఆదివారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో పెద్దమ్మ తల్లికి 108 బిందెలతో నీటిని తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. అలాగే అమ్మవారికి అర్చకులు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సాయిబాబానగర్‌లోని సీపీఐ స్వామిరెడ్డి భవన్‌లో నంద్యాల జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, ఎనర్జీ సెక్రటరీలను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను మంజూరు చేసి ఈపీఎఫ్ కాకుండా జీపీఎస్ అమలు చేయాలన్నారు. సమస్యల సాధన కోసం వివిధ కార్యక్రమాలు చేపనున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

రోటరీ సభ్యులకు సత్కార్ అవార్డులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రోటరీ క్లబ్ సభ్యులు సత్కార్ అవార్డులను అందుకున్నారని రోటరీ అధ్యక్షుడు దండె దస్తగిరి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి విశేష కృషి చేసిన పీడీజేలు రామలింగారెడ్డి, శ్రీరామమూర్తి, చిన్నపురెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డికి అవార్డులను లభించినట్లు చెప్పారు.

ఉల్లాసంగా కార్తీక వన భోజనాలు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనందీశ్వర స్వామి ఆలయ ఆవరణంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల భారత రజక సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. అలాగే రజక వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేశారు. అనంతరం మ్యూజికల్ చైర్, కబడ్డీ, తాడాట తదితర పోటీలతో పాటు పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం, మెమొంటోలను అందజేశారు. సంఘం నాయకులు సుబ్బారావు, జిల్లెల్లె శ్రీరాములు, రోశన్న, రామమద్దిలేటి పాల్గొన్నారు. అలాగే.. స్థానిక భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో వీరశైవ సేవా సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు నాగరాజు, వీరశైవులు శివప్ప, మల్లప్ప, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నంద్యాల (సిటీ): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సహ ఉద్యోగికి రూ.50వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. ఆళ్లగడ్డ అర్బన్ 8వ వార్డు సచివాలయంలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆదిలక్ష్మి ఈ నెల 17న రోడ్డు ప్రమాదానికి గురైంది. చికిత్స పొందుతున్న ఆమెకు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రవి కుమార్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.జిల్లా ప్రెసిడెంట్ జయవర్ధన్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, సతీష్, హుసేన్ వలి పాల్గొన్నారు.

పదిలంగా పాతాళగంగ

- జిల్లా వ్యాప్తంగా పుష్కలంగా భూగర్భ జలాలు
- అన్ని మండలాలు సేఫ్ జోన్‌లోనే
- నగటు నీటి మట్టం 6 మీటర్ల లోపే
- ఎక్కడా పరిమితికి మించి లేని వినియోగం
- వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకపోవచ్చు



బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల వద్ద పంపు నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు

మండలం	నీటి మట్టం (మీటర్లలో)	అవుకు	3.88
ఆత్మకూరు	2.61	ఆళ్లగడ్డ	4.23
బండిఆత్మకూరు	1.08	గడివేముల	5.5
వెలుగోడు	2.4	మహానంది	3.44
దొర్నిపాడు	1.98	నంద్యాల	3.52
గోస్పాడు	2.78	పాణ్యం	7.11
రుద్రవరం	2.3	సంజామల	4.29
శిరివెళ్ల	1.5	ఉయ్యాలవాడ	3.03
జూపాడుబంగ్లా	6.02	కొత్తపల్లి	8.28
మిడ్తూరు	5.72	నందికొట్కూరు	12.5
పగిడ్యాల	3.16	కొలిమిగుండ్ల	11.11
పాములపాడు	7.59	బేతంచర్ల	18.82
శ్రీశైలం	6.92	డోన్	15.56
బనగానపల్లె	6.69	ప్యాపిలి	15.02
కోవెలకుంట్ల	5.4	చాగలమర్రి	16.29

నంద్యాల(సెంట్రల్): ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు వెక్కిరిస్తున్నా జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాల లభ్యత మాత్రం సురక్షితంగానే ఉంది. జూన్ నుంచి అక్టోబర్ ఆఖరు వరకు 622.33 మి.మీ. వర్షం కువాలల్సి ఉండగా 27 శాతం తక్కువగా 452.4 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. అయినా భూగర్భ జలాలు సగటు 6 మీటర్ల లోతులోనే అందుబాటులో ఉన్నాయి. జిల్లాలోని 29 మండలాలు సేఫ్ జోన్‌లో ఉండటం విశేషం. జిల్లాలో ఎక్కడా పరిమితికి మించి నీటిని వాడుతున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం 3 మీటర్లలోపు 7 మండలాల్లో భూగర్భ నీటిమట్టం ఉండగా...3 నుంచి 8 మీటర్ల మధ్య 15 మండలాలు ఉన్నాయి. 8 నుంచి 15 మీటర్ల మధ్య 3 మండలాలుండగా...15–20 మీటర్ల మధ్య 4 మండలాలు ఉన్నట్లు భూగర్భ జలవనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి. చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడులో అత్యంత లోతు (38.92 మీటర్లు)లో భూగర్భ జలాలు ఉండగా, ఉయ్యాలవాడ మండలం గోవిందపల్లె భూ ఉపరితలానికి అతి సమీపంలో (0.45 మీటర్లు) నీటి లభ్యత ఉన్న ప్రదేశంగా అధికారులు పేర్కొన్నారు. ఈ జల సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 27.15 టీఎంసీల వర్షపు నీరు భూమిలోకి ఇంకగా, ఇందులో 5.05 టీఎంసీల నీటిని ఇప్పటివరకూ అన్ని రకాల అవసరాలకు వినియోగించుకున్నారు. ఇంకా 22.10 టీఎంసీ నీరు అందుబాటులో ఉంది.

తాగునీటికి ఇబ్బంది ఉండదు

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. జిల్లా వ్యాప్తంగా పుష్కలంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో.. వేసవిలో తాగునీటికి సమస్య ఉండకపోవచ్చు. అయినప్పటికీ జిల్లావాసులు పొదుపుగా నీటిని వాడుకోవాలి. నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరి లాంటి పంటలు వేయకపోవటం, కాలువల ద్వారా నీటిని కట్టే విధానం కాకుండా డ్రిప్ విధానం అవలంబిస్తే సమస్య ఉండదు. జిల్లా వ్యాప్తంగా ఏ గ్రామంలోనూ వాల్టా చట్టం అమలులో లేదు. భూగర్భ జలాల స్టేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ 18.63 శాతంగా ఉంది. కాబట్టి అన్ని మండలాలు సేఫ్ జోన్‌లోనే ఉన్నాయి.

– రఘురాం, భూగర్భ జలవనరుల ఉపసంచాలకులు, నంద్యాల జిల్లా

భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి



ఈ ఏడాది వర్షాలు సరిగ్గా పడకపోవటంతో ఆందోళన చెందాం. 4 ఎకరాల్లో మినుము, శనగ పంటలు సాగుచేశా. ఎండ తీవ్రత కాస్త ఎక్కువగా ఉండటంతో కొద్దిరోజులకే పంటలు బెట్ట పోతున్నాయి. దీంతో బోరు నీటితో ఎప్పటికప్పుడు తడులిచ్చుకుంటూ పంటలను రక్షించుకుంటున్నాం. పొలంలో వేసిన బోరు నుంచి రెండున్నర ఇంచుల నీరు సమృద్ధిగా వస్తోంది. ఇప్పటి వరకు కాస్తైనా నీటి మట్టం తగ్గలేదు. భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. మా ఇంటి దగ్గర ఉన్న తాగునీటి బావిలోనూ నీరు పుష్కలంగా ఉంది.

– చేరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బిలూం, కొలిమిగుండ్ల

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ వినతి పత్రాలు అందజేయాలని సూచించారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందజేస్తామని ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు.. ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తికి తీవ్రగాయాలు

మహానంది: బంధువులను పలకరించి బైకుపై వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం తమడపల్లె మలుపుల వద్ద చోటు చేసుకుంది. కోవెలకుంట్లకు చెందిన రాముడు తమడపల్లె గ్రామంలోని బంధువులను పలకరించి నంద్యాల వైపు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాముడికి తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల(అర్బన్): గ్రామాల సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం, తాగునీరు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో రూ.2కోట్లతో రహదారులు, అభివృద్ధి పనులకు ఆదివారం భూమి పూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.35లక్షలతో సచివాలయం, రూ.53లక్షలతో అంతర్గత రోడ్లు, రూ.88లక్షలతో వాటర్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. పాండురంగాపురం, కానాల గ్రామాల మధ్య రహదారి నిర్మాణానికి రూ.కోటి వ్యయం చేయనున్నామన్నారు. ఇందుకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. నంద్యాల, మిట్నాల, గుంతనాల, లింగాల గ్రామాల మధ్య దెబ్బతిన్న ప్యాచింగ్ పనులకు మరో రూ.2కోట్లు నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పురుషోత్తమరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీ లక్ష్మి, సర్పంచ్ డోలావతమ్మ, నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, అప్పిరెడ్డి, పున్నారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

సంక్షేమ సారథికి అండగా నిలుద్దాం

రుద్రవరం: అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఆలమూరులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు గజమాలతో గ్రామంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సాయాన్ని వివరించారు. అలాగే పింఛన్ పంపిణీ సక్రమంగా సాగుతోంద,వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి సొమ్ము అందిస్తున్నారా అని ఆయన లబ్ధిదారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. టీడీపీలో పథకాల అమలు, అభివృద్ధి, పథకాల లబ్ధిని జగనన్న పాలనతో పోల్చి వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మొద్దని, మరోసారి కష్టాలు కొనితెచ్చుకోవద్దని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని కోరారు. అనంతరం జాతీయ న్యాయ దినోత్సవంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించరు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, ఎంపీటీసీ మీరాంబి, తహసీల్దారు వెంకటశివ, ఎంపీడీఓ మధుసూధనరెడ్డి, ఏఈలు రాఘవేంద్రారెడ్డి, వెంకటరాముడు, ఏఓ శ్రీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శూలం ప్రభాకర్, నాయకులు నాగేష్, లక్ష్మీనారాయణ, బ్రహ్మయ్య, చంద్ర, జయరాముడు, రహీం, గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాములేటి ఉన్నారు.



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



ఆలమూరులో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఎన్‌సీసీతో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు

ఆళ్లగడ్డ: దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి విద్యార్థి దశలో ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందని పట్టణ సీఐ రమేష్‌బాబు అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ప్రజ్ఞ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు ఏర్పాటు చేసిన పేరేడ్‌లో పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ ఎన్‌సీసీతో దేశ సేవ చేసుకునే అవకాశంతో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం వీరరాఘవయ్య, కేఎస్ఎం మున్సిపల్ ఇన్‌చార్జి హెచ్ఎం షఫక్తుల్లా, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశ భక్తిని, క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. అనంతరం స్పీచ్‌లో కేడెట్ సాగర్‌కు మొదటి బహుమతి అందజేశారు. అలాగే జిల్లా ఎయిడ్స్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో రూ.13వేలు అందజేయగా.. ఆ మొత్తాన్ని వైఎస్సార్ నగర్‌లోని ఎయిడ్స్ రోగులకు విరాళంగా అందజేయడంతో వారు అభినందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు రవికుమార్, శారద పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులతో సీఐ రమేష్‌బాబు

మల్లన్న సేవలో..



స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వస్తున్న దేవదాయశాఖ కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం ,అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక,వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదం అందజేశారు.

అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో 1990–91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు ఒక వేదికపై చేరారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, బీవయ్య, సుదర్శన్, ఖాజావలి, జగదీశ్వరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, చెన్నకేశవరెడ్డి, పద్మావతి, ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగం దినోత్సవం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీలు



చాగలమర్రిలో అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



నివాళులర్పిస్తున్న హబీబుల్లా



సాంబవరంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్, ప్రతాప్ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ వీరభద్రుడు, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్‌బాబులాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సర్పంచ్ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ పేర్కొన్నారు. ఆదివారం రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పరిపాలనాధికారి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గోస్పాడు: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన ఎంతైనా అవసరమని గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ మురళీ కల్యాణి, డీఎల్‌డీఓ రాంబాబు అన్నారు. మండలంలోని సాంబవరం, దీబగుంట్ల గ్రామాల్లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పలు సంక్షేమ పథకాల గురించి వివరంచారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచులు ఐజయ్య, శివమ్మ,నాయకులు చిన్ననాగిరెడ్డి, బొరెడ్డి గోపాల్‌రెడ్డి, ఈఓఆర్‌డీ అనసూయ, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): పాలకులందరూ ప్రజా సేకులేనని ప్రజాస్వామ్య ఐక్యవేదిక నంద్యాల జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయవాది దుర్గాప్రసాద్, ఎస్పీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునిశేఖర్‌పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం బొమ్మలసత్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే.. ఎస్సీ హాస్టల్ ఆవరణంలో దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ ఎంపవర్‌మెంట్ అధికారిణి చింతామణి, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు, తహసీల్దార్, శ్రీనివాసులు పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు డీఎస్ హబీబుల్లా తన క్యాంపు కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

సహస్ర దీపాలంకరణ.. జ్వాలా తోరణం





ఎస్‌బీఐ రామాలయంలో సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న మహిళలు,కల్పనాసెంటర్, అయ్యప్పస్వామి ఆలయాల్లో జ్వాలాతోరణాలు వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని శైవ దేవాలయాల్లో అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జ్వాలాతోరణం, సహస్ర దీపోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

- భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ, జ్వాలాతోరణ కార్యక్రమాన్ని జరిపించారు.కాళికాంబ దేవస్థానంలో నక్షత్రాకారంలో సహస్ర దీపాలంకరణ,స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రథమనందీశ్వర స్వామి ఆలయంలో జెడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్తీక శివోత్సవం కార్యక్రమంలో భాగంగా జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాలలో భవనాశి వాసు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ జరిపించారు. కల్పనా సెంటర్ రామాలయంలో కాశీవిశ్వనాథుడికి సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు, జ్వాలాతోరణం నిర్వహించారు. భీమలింగేశ్వర ఆలయంలో రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో జ్వాలాతోరణం, గుడిపాటిగడ్డలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సహస్ర దీపాలంకరణ, జ్వాలాతోరణం, ఎస్‌జీఓ కాలనీలోని స్ఫటిక లింగేశ్వర ఆలయంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ, జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు.



శ్రీనివాసపురంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గోస్పాడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీనివాసపురం గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో వేద పండితుడు రామశేషయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయము దీపాలంకరణతో కళకళలాడింది. గ్రామస్తులందరూ జ్వాలా తోరణంతో పాటు కార్తీక దీపోత్సవాన్ని మూకుమ్మడిగా చేపట్టారు.





చాగలమర్రి: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం శైవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పాత శివాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామలింగేశ్వరస్వామి, అలాగే సంత మార్కెట్ సమీపంలోని శ్రీభీమలింగేశ్వరస్వామి, ముత్యాలపాడులోని శ్రీశరభేశ్వరస్వామి, చింతల చెరువు సమీపంలో శ్రీభైరవేశ్వరస్వామి ఆలయాల్లో దీపోత్సవం, జ్వాలా తోరణం, పల్లకీ సేవ నిర్వహించారు.



నంద్యాలలోని అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ముత్యాలపాడులోని శరభేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపార్చనలో పాల్గొన్న భక్తులు